క్లుప్తంగా

సొంత ఖర్చులతో ప్లాట్‌ఫాం నిర్మాణం



చేతిపంపునకు ప్లాట్‌ఫాం నిర్మిస్తున్న రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: బూర్గుడ బీసీ కాలనీలోని చేతిపంపునకు ప్లాట్‌ఫాం లేక కొన్నేళ్లుగా పారిశుధ్య సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక ఎంపీటీసీ రమేశ్ తన సొంత ఖర్చులతో ఆదివారం చేతిపంపునకు ప్లాట్‌ఫాం నిర్మించారు. గ్రామపెద్దలు బాబాజీ, బాలకిషన్, ముదురుకోల రమేశ్, ఓమాజి, ప్రకాష్, సాయితేజ ఉన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రంజాన్ పండుగ పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న కానుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ, సందీప్‌నగర్, ఇతర కాలనీల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యదర్శి సాలం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలకు గుర్తింపు వచ్చిందన్నారు. నాయకులు షబ్బీర్, అహ్మద్, తాజ్, నజీర్, ఇమ్రాన్, షాహీద్, తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 16 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లేష్, జైచందర్, నాయకులు వివి ప్రసాద్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేటలో హైదరాబాద్ నెక్ట్‌జెన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య ప్రారంభించారు. శిబిరంలో సుమారు వంద మందికి పైగా ఉచితంగా ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులతో పాటు అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందించారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

దండేపల్లి: దండేపల్లి కేజీబీవీ విద్యార్థి రాథోడ్ కల్యాణి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్ (టీటీడబ్ల్యూ సీవోఈ) వరంగల్‌లో సీటు సాధించినట్లు కేజీబీవీ ఎస్వో మంజుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో ఆమె ప్రతిభ కనబరచడంతో బైపీసీ గ్రూపులో సీటు లభించిందని పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: రుద్రుడు
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: రుద్రుడు

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
రతాళం	60
గోబి(ఫూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

చింతలమానెపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారసంత



ఆదాయం ఉన్నా.. సమస్యలే నిండా

- అసౌకర్యాలకు నిలయంగా వారసంతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇటీవలే పూర్తయిన వేలం

చింతలమానెపల్లి: మండలంలో నిర్వహించే వారసంతలు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. వారసంతల నుంచి ఆదాయం వస్తున్నా అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలో చింతలమానెపల్లి, రవీంద్రనగర్, గూడెం, బాబాసాగర్ గ్రామాలలో వారసంతలు నిర్వహిస్తున్నారు. చింతలమానెపల్లి, బాబాసాగర్‌లలో బుధవారం, రవీంద్రనగర్‌లో శుక్రవారం, గూడెం గ్రామంలో ప్రతీ మంగళవారం వారసంతలు జరుగుతున్నాయి.

గ్రామ పంచాయతీలకు ఆదాయం..

మార్చిలో వారసంతలకు వేలం నిర్వహించగా చింతలమానెపల్లి వారసంతకు రూ. 90వేలు, రవీంద్రనగర్ వారసంతకు రూ.4లక్షల 27వేలు, గూడెం వారసంతకు రూ. 91వేలు ఆదాయం వచ్చింది. కాగా బాబాసాగర్ వారసంతను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పంచాయితీరాజ్ చట్టాలను అనుసరించి నిర్ణీత రుసుమును దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారుల నుంచి వేలం దక్కించుకున్న వారు వసూలు చేస్తుంటారు. అయితే గ్రామపంచాయతీలకు ఆదాయవనరులుగా ఉన్న వారసంతల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని రవీంద్రనగర్ మినహా ఏ గ్రామపంచాయతీలో వారసంతలకు ఇప్పటివరకు స్థలాలు కేటాయించలేదు. మండల కేంద్రంలో వారసంతను నెల రోజుల నుంచి పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా రహదారిపై నిర్వహిస్తున్నారు. గూడెంలో గతంలో అటవీశాఖ నర్సరీ నిర్వహించిన స్థలంలో ఏర్పాటు చేశారు. బాబాసాగర్‌లో సైతం రహదారిపైనే నిర్వహిస్తున్నారు.

స్థలం కోసం దరఖాస్తు చేశాం

మండల కేంద్రంలో నిర్వహించే వారసంత స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాం. వారసంత స్థలంలో తాత్కాలికంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. వారసంతకు స్థలం కేటాయిస్తే ఉపాధిహామీ పథకంలో భాగంగా షెడ్లు, ఇతర పనులు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

- ఆసిఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శి, చింతలమానెపల్లి

సౌకర్యాలు కరువు..

మండలంలోని రవీంద్రనగర్‌లో వారసంతకు కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాలలోని సుమారు 30గ్రామాల ప్రజలతోపాటు కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల నుంచి వ్యాపారస్తులు వస్తుంటారు. కాగా వారసంతల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. రవీంద్రనగర్, చింతలమానెపల్లి వారసంతల్లో వినియోగదారులు, వ్యాపారస్తుల వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో వాహనాలను రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ జాం సమస్య తలెత్తుతోంది. మరోవైపు దుకాణాలను సైతం రహదారులపై ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సమస్యకు రవీంద్రనగర్‌లో నీటి ట్యాంక్ ఏర్పాటు చేసినా మిగతా వారసంతల్లో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదు. వారసంతల అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో ఒకప్పుడు వ్యాపారాలు జరిగిన బాబాసాగర్ వారసంత మూతపడే స్థితికి చేరుకుంది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని బాబాసాగర్ గ్రామస్తులు విమర్శిస్తున్నారు. వ్యాపారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో వానకు, ఎండకు ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కుంటతో నిశ్చింత

- బోరు బావుల్లో భూగర్భజలం పెరిగే అవకాశం
- ఏడేళ్లలో 628 నిర్మాణాలు పూర్తి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పరందోలిలో నీటికుంటలో నిలిచిన వర్షపు నీరు



దేవాపూర్ గ్రామపంచాయతీలో నీటి కుంట నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

కెరమెరి: నీటిని నిల్వ చేసుకునేందుకు రైతులు పొలాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా సేద్యపు కుంటలు నిర్మిస్తున్నారు. వీటి ఏర్పాటుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అధికారులు పేర్కొంటున్నారు. పొలంలో సేద్యపు కుంటల నిర్మాణం జరిగితే వర్షం నీరంతా ఒకే వైపునకు చేరే అవకాశం ఉంటుంది. నీరు నిల్వ చేసేందుకు అవకాశం ఉన్న పల్లపు ప్రాంతాన్ని గుర్తించి తవ్వకం పనులు చేపడుతున్నారు. ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతీ రైతు కుంట నిర్మించుకోవడానికి అర్హుడు. సేద్యపు కుంటల్లో వానాకాలంలో నిల్వ చేసిన నీరు ఎండాకాలంలో పంటలతో పాటు పశువులు, పక్షులకు ఎంతగానో ఉపయోగపడనుంది. కుంటల నిర్మాణంతో సమీపంలోని బోరు బావుల్లో భూగర్భజలాల మట్టం కూడా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా ఒక్కో కుంట నిర్మాణానికి ఒక్కో రేటు ఉంది.

మండలంలో..

మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 11,300 జాబ్ కార్డులుండగా, 4600 యాక్టివ్ జాబ్ కార్డు దారులు ఉన్నారు. 21,173 కూలీలకు 3,718 మంది కూలీలు ప్రతీరోజు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధిహామీలో భాగంగా సాగు నీటిని అందించే ప్రధాన కాల్వలు, పూడికతీత, చెక్‌డ్యాంల నిర్మాణం, వరద కట్టల ఏర్పాటు, ఇంకుడు గుంతలతో పాటు పొలంలో సేద్యపు కుంటల తవ్వకం పనులు చేస్తున్నారు. గత ఏడేళ్లలో 628 వరకు సేద్యపు నీటి కుంటల నిర్మాణం పూర్తి కాగా 2021-22లో 123 కుంటలు నిర్మించారు.

అధిక ప్రాధాన్యం



మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీలో అధికంగా సేద్యపు నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ గ్రామపంచాయతీలో గత వార్షిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు కుంటల నిర్మాణాలు చేపట్టాం. టీఏల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నీటి కుంటల నిర్మాణంతో రైతులకు ఎంతో లాభం ఉంటుంది.

- మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

తిర్యాణి: క్రీడాకారులు గెలుపోటములు సమానం స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని చాటాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు అనిల్‌గౌడ్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, నాయకులు కిష్టయ్య, వెంకన్న, పులిశెట్టి రాజు, పున్నం హరీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పరిచయం చేసుకుంటున్న విశ్వప్రసాదరావు

బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకే అరెస్టులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే అధికార పార్టీ నాయకులు అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెబ్బెన మండలంలో ఓ ప్రైవేటు కంపెనీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికే ఉద్యోగ అవకాశాలు కల్పించడాన్ని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజ్మీరా ఆత్మారాంనాయక్‌తో పాటు 34 మందిపై అక్రమ కేసులు బనాయించి జైల్‌లో పెట్టడం దారుణమన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజ్మీరా ఆత్మారాం నాయక్, భోనగిరి సతీష్ బాబు, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి హరీష్‌బాబు, ఖాండ్రె విశాల్, గణేష్, కేసరి అంజనేయులుగౌడ్, సుచిత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన హరీష్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా కేంద్రంలో ఆదివారం జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ హన్స్‌రాజ్ అహీర్‌ను సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కోటపల్లి: మైనార్టీల సంక్షేమానికి వివిధ పథకాలను బీఆర్‌ఎస్ సర్కార్ అమలు చేస్తోందని వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందించే కానుకలను ఆదివారం సర్వాయిపేటలో వైస్ ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత కుమారి, జడ్పీకోఆప్షన్ అజ్గర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, నాయకులు గుర్రం రాజన్న, విద్యాసాగర్ పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ తోఫాను పంపిణీ చేశారు. ఇందులో ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి గౌస్, నాయకులు జావీద్ హుస్సేన్, ఆసిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.



కానుకలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిమాపక అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో వారోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ప్రమాదాల బారిన పడిన వారికి ప్రథమ చికిత్స ఏ విధంగా అందజేయాలో వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముత్తె శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కావడంతో ఆసుపత్రి ఖర్చులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కారుకూరి ట్రస్టు చైర్మన్, న్యాయవాది కార్కూరి సురేందర్ తన ట్రస్టు ద్వారా రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు.

శ్రీరామదూత సేవాసమితి ఆధ్వర్యంలో రోడ్డు ఏర్పాటు

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామపంచాయతీ మారుమూల గ్రామం పాత తిరుమలపూర్‌లో ఆదివారం శ్రీరామదూత సేవాసమితి ఆధ్వర్యంలో మొరం రోడ్డు పోశారు. వర్షాకాలంలో ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులపు దృష్టిలో పెట్టుకుని మొరం పోసినట్లు తెలిపారు.

వీఓఏల సమ్మె సైరన్..!

- నేటి నుంచి నిరవధిక సమ్మె
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- జిల్లాలో 398 మంది వీఓఏలు



నినాదాలు చేస్తున్న కాగజ్‌నగర్ డివిజన్‌లోని వీఓఏలు

కౌటాల: నేటి నుంచి వీఓఏల సమ్మె సైరన్ మోగనుంది. 20 ఏళ్లుగా మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేసినా, ఎంతో పని భారం ఉన్నా సహనంతో సేవలందిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏలు) అవస్థలు పట్టించుకోవడం లేదని నిరవధిక సమ్మెకు వెళ్లనున్నారు. వేతనాల పెంపుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు డిమాండ్ చేస్తున్నారు.

సేవలందిస్తున్నా వేతనాల్లేవ్..

పొదుపు సంఘాల సభ్యులకు సహాయ సహకారాలు అందించడం వీఓఏల పని. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన 20 రకాల పనులను వీఓఏలకు అప్పగించారు. సంఘాలకు సంబంధించిన పుస్తకాలు రాయడం, మినిట్స్ బుక్స్, వేలిముద్రలు తీసుకోవడం, ఆన్‌లైన్ వర్క్‌లు అప్‌లోడ్ చేయడం వంటి ఎన్నో పనులను చేస్తుంటారు. పేదరికంలో ఉన్న మహిళలను గత 20 ఏళ్లుగా పోగుచేసి సంఘాలు ఏర్పాటు చేసిన ఐకేపీ వీఓఏలకు ప్రభుత్వం గౌరవ వేతనం సక్రమంగా చెల్లించడం లేదని వీఓఏలు ఆరోపిస్తున్నారు. సంఘం ఖర్చు, జమా ఖాతా నమోదు చేయడం, రుణాల మంజూరు విషయంలో ఇటు గ్రూపునకు అటు బ్యాంకులకు మధ్య సంధానకర్తగా వ్యవహరించడం, గ్రూపు ఖాతాను పర్యవేక్షించడం వంటి బాధ్యతలను వీఓఏలు చూడాల్సిందే. నయా పైసా ఇవ్వకుండా వీరితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 398 మంది వీఓఏలు ఉన్నారు. వందశాతం ఆన్‌లైన్ వర్క్ పూర్తి చేసిన వారికి రూ.3900 మాత్రమే ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లిస్తోంది.

మహిళా సంఘాల నిర్వహణకు ఆటంకం

స్వయం సహాయక సంఘాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా సమన్వయం చేయడంలో వీఓఏల పాత్ర కీలకం. పొదుపు సంఘాల కార్యకలాపాల్లో అట్టడుగు స్థాయిలో పనిచేసే గ్రామ సహాయకులు(వీఓఏలు), పట్టణ రిసోర్స్ పర్సన్(ఆర్‌పీ)లకు ప్రతి నెలా చెల్లించే గౌరవ వేతనం తక్కువగా ఉంది. పొదుపు సంఘాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాలు, తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయడం, బ్యాంకు అధికారులతో మాట్లాడి పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం లాంటి కీలక పనులను వీరు నిర్వహిస్తుంటారు. ఎంత కష్టపడి పని చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వీఓఏలు నిరవధిక సమ్మెబాట పట్టారు. దీంతో మహిళా సంఘాల నిర్వహణకు ఆటంకం కలగనుంది.

నేటి నుంచి నిరవధిక సమ్మె

ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, వీఓఏల డిమాండ్లు పరిష్కరించాలని జిల్లాలోని వీఓఏలు గత నెల 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేపట్టారు. కాని ప్రభుత్వం స్పందించలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. సమ్మె చేస్తామని సంబంధిత శాఖ అధికారులకు సమ్మె నోటీసులు అందించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు.


సమ్మె విజయవంతం చేయాలి



కొన్నేళ్లుగా మహిళా సంఘాల అభివృద్ధి కోసం వెట్టి చాకిరి చేస్తున్నాం. అయినా ప్రభుత్వం మాకు కనీస గౌరవ వేతనం ఇవ్వడం లేదు. దీంతో గత నెలలో మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేశాం. ప్రభుత్వం స్పందించలేదు. సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతాం. జిల్లాలోని వీఓఏలు సమ్మెను విజయవంతం చేయాలి.

- సీహెచ్ జ్యోతి, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి



ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. వీఓఏలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్నాం. ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి.

- ఎల్ములే దత్తు, వీఓఏ, తాటిపల్లి

డిమాండ్లు ఇవే..

- వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి. యూనిఫాం ఇవ్వాలి.
- రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.
- ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలి. సెర్ప్ నుంచి ఐడీకార్డులు ఇవ్వాలి.
- మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.
- మహిళా సంఘాలకు బ్యాంక్ వీఎల్ఆర్ డబ్బులు ఇవ్వాలి.
- అభయహస్తం డబ్బులు అందరికీ తిరిగి ఇవ్వాలి.
- ప్రతీ గ్రామ సంఘానికి పక్కా భవనం నిర్మించాలి.

గ్రామాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలి

కౌటాల: గ్రామీణ ప్రాంతాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని కోయగూడ సమీపంలో నిర్మించిన జగదాంబ ఫంక్షన్‌హాల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల కౌటాల మండలం దినదినం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు నాహీం, గట్టయ్య, సత్తయ్య, కైలాసం, శ్రీనివాస్, రాంచందర్, సంతోష్, రమేశ్, నిర్వాహకులు తెలి దుర్గయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ స్టేట్ కంట్రీబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి విన్నవించారు. తమ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కోనప్ప ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.